
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com
గురువారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6। కనిష్ఠం 20.8
కామారెడ్డి జిల్లా వార్తలు
3
శుక్రవారం 16 ఫిబ్రవరి 2024



## కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా సుజాత



బాధ్యతలు స్వీకరిస్తున్న సుజాత

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15: కామారెడ్డి మున్సిపల్ కమిషనర్‌గా గురువారం కే.సుజాత బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఇక్కడ పని చేసిన కమిషనర్ దేవేందర్ రామయంపేటకు బదిలీ కాగా ఆయన స్థానంలో సుజాత బదిలీపై వచ్చారు. గతంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో మొట్టమొదటి సారిగా మున్సిపల్ కమిషనర్‌గా చేసి ప్రస్తుతం కామారెడ్డిలో విధులు నిర్వహించనున్నారు.

---

జిల్లా కేంద్ర గ్రంథాలయం





# సెస్ చెల్లింపు అంతంతే

- గ్రంథాలయాలకు చెల్లించాల్సిన సెస్‌పై నిర్లక్ష్యం వహిస్తున్న స్థానిక సంస్థలు
- ప్రజల నుంచి వసూలు చేస్తున్నా చెల్లించని వైనం
- జిల్లాలోని శాఖ గ్రంథాలయాల్లో అంతంత మాత్రంగానే పుస్తకాలు
- పుస్తకాలు కొనుగోలు చేసేందుకు నిధులు కరువు
- నిధులు లేక దాతల వైపు చూడాల్సిన పరిస్థితి

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15: ప్రతి ఒక్కరూ తప్పకుండా ఆస్తిపన్ను చెల్లించాలని ప్రజలకు సూచిస్తున్న స్థానిక సంస్థల అధికారులు వారు విధిగా చెల్లించాల్సిన గ్రంథాలయ పన్నును మాత్రం విస్మరిస్తున్నారు. దీంతో గ్రంథాలయాలకు న్యాయబద్ధంగా రావాల్సిన పన్నులు రాక గ్రంథాలయాల అభివృద్ధి కుంటుపడుతోంది. జిల్లావ్యాప్తంగా ఉన్న మూడు మున్సిపాలిటీలు, 526 గ్రామ పంచాయతీల్లో వసూలు చేస్తున్న ఆస్తిపన్నులో గ్రంథాలయ పన్నును సైతం ప్రతీ సంవత్సరం ప్రజల నుంచి వసూలు చేస్తున్నప్పటికీ గ్రంథాలయాల ఖాతాల్లో మాత్రం జమ చేయడం లేదు. ప్రభుత్వం విడుదల చేసే నిధులతో పాటు ఈ నిధులతోనే అభివృద్ధి పనులు, గ్రంథాలయాల్లో పుస్తకాల కొనుగోలు చేస్తుంటారు.

### రూ.1 కోటి 22లక్షల బకాయిలు

జిల్లాలోని పలు గ్రామ పంచాయతీల్లో సంవత్సరాల తరబడి పన్నులను చెల్లించకపోవడంతో గ్రంథాలయ సంస్థకు నిధుల లేమీ ఏర్పడి పుస్తకాల కొనుగోలుకు దాతల వైపు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దాదాపు 4 సంవత్సరాల నుంచి రూ.2 కోట్ల 22 లక్షలకుపైగా గ్రంథాలయ పన్ను ఆయా స్థానిక సంస్థల నుంచి రావాల్సి ఉందని గ్రంథాలయశాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ఇందులో కేవలం కోటి రూపాయలు మాత్రమే చెల్లింపులు జరిపారు. మిగిలిన 1 కోటి 22లక్షలు ఇంకా బకాయి ఉంది. సెస్‌లు చెల్లించాలని గ్రామ పంచాయతీల చుట్టూ సిబ్బంది తిరుగుతున్నా పెడచెవిన పెడుతున్నారే తప్ప న్యాయబద్ధంగా చెల్లించాల్సిన పన్నులు మాత్రం చెల్లించడంలేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రజలు మాత్రం నిబంధనలు పాటించి పన్ను చెల్లించాలని సూచిస్తున్నా ఉన్నతాధికారులు స్థానిక సంస్థలకు తమశాఖ తరఫున చెల్లించాల్సిన పన్నులపై మాత్రం విస్మరిస్తున్నారు. ఈ నిధులు వస్తేనే నిరుద్యోగులకు సరైన పుస్తకాలు అందించే అవకాశంతో పాటు సౌకర్యాల కల్పన కు ఉపయోగపడనుంది.

### ఆస్తి పన్నులో 8 శాతం గ్రంథాలయ పన్ను వసూలు

మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీలు వసూలు చేసే ఆస్తి పన్నులో నుంచి 8 శాతం నిధులు సెస్(సుంకం) రూపంలో ఆయా గ్రంథాలయాలకు చెల్లించాల్సి ఉంటుంది. అందుకే ప్రభుత్వం నుంచి వచ్చే ఆదాయం కంటే ఈ సెస్‌రూపంలో వచ్చే నిధులే గ్రంథాలయాల అభివృద్ధికి, నిర్వహణకు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయి. అయితే మున్సిపాలిటీలు గుడ్డిలో మెల్లిల సెస్‌ను గ్రంథాలయాల ఖాతాల్లో జమ చేస్తున్నా గ్రామ పంచాయతీల నుంచి మాత్రం ఏళ్ల నుంచి సెస్ అందక సమస్యగా మారుతుంది. నిబంధనల ప్రకారం ఆస్తిపన్నులో వసూలు చేసిన 8 శాతం నిధులను విధిగా పంచాయతీ కార్యదర్శులు గ్రంథాలయాల ఖాతాలలో జమ చేయాల్సి ఉన్నా అలసత్వం వహిస్తున్నారని తెలుస్తోంది. దీనివల్ల జిల్లాలోని కేంద్ర గ్రంథాలయంతో పాటు శాఖ గ్రంథాలయాలపై ఆర్థిక భారం పడుతోంది. ఈ నిధులతో కొత్త గ్రంథాలయాల నిర్మాణం, పాత వాటి రిపేర్లు, పుస్తకాలు, దినపత్రికల కొనుగోలు, తాగునీరు, మరుగుదొడ్లు వంటి వసతుల కల్పనకు ఖర్చు చేస్తారు.

### నిరుద్యోగులకు అరకొరగా పుస్తకాలు

జిల్లా కేంద్ర గ్రంథాలయంలో తప్ప ఆయా శాఖ గ్రంథాలయాల్లో నిరుద్యోగులకు అవసరమైన పుస్తకాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ప్రస్తుతం నోటిఫికేషన్‌లు వస్తుండడంతో గ్రంథాలయాలకు నిరుద్యోగులు పెద్ద ఎత్తున వస్తున్నారు. వారికి అవసరమైన పుస్తకాలు అందుబాటులో లేక సొంతంగా కొనుగోలు చేసుకున్న పుస్తకాలను తీసుకుని వచ్చి గ్రంథాలయాల్లో చదువుకుంటున్నారు. ఆయా శాఖల్లో ఖాళీగా ఉన్న పోస్టులకు నోటిఫికేషన్‌లను జారీ చేస్తామని ప్రభుత్వం ప్రకటిస్తుండడంతో గ్రంథాలయాల వైపు నిరుద్యోగులు వస్తున్న వారికి అవసరమైన పుస్తకాలు మాత్రం కరువయ్యాయి. నిధుల కొరత కారణంగా దాతల ద్వారా పుస్తకాలను అందుబాటులోకి తీసుకువచ్చి గ్రంథాలయాలకు రావాల్సిన నిధుల కోసం ఇప్పటికే గ్రంథాలయ సిబ్బంది పంచాయతీ కార్యదర్శులకు విన్నవించినా సెస్ చెల్లింపుల్లో మాత్రం పురోగతి కనిపించడం లేదు. దాదాపు కోటి రూపాయాలకు పైగా సెస్ రావాల్సి ఉందని అవి వస్తే జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధితో పాటు పుస్తకాలను అందుబాటులోకి తీసుకురావచ్చనే వాదనలు వినిపిస్తున్నాయి.

### మార్చి 31లోగా చెల్లించాలి

జిల్లా వ్యాప్తంగా ఉన్న గ్రామ పంచాయతీలు వసూలు చేసిన ఆస్తి పన్ను నుంచి మార్చి 31లోగా ఆయా గ్రంథాలయాలకు సెస్ చెల్లించాల్సి ఉంటుంది. ఏప్రిల్‌తో నూతన ఆర్థిక సంవత్సరం ప్రారంభమయ్యే నేపథ్యంలో చెల్లించిన 8 శాతం సెస్ నిధులను ఆడిట్ రిపోర్టులో డీపీవో చూపించాల్సిన పరిస్థితి నెలకొంది. కానీ సంవత్సరాల తరబడి సెస్‌ను గ్రంథాలయాలకు చెల్లించకుండా పలువురు కార్యదర్శులు అలసత్వం వహిస్తున్నారు. కొంత మంది పంచాయతీ కార్యదర్శులు సెస్ నిధులను గ్రంథాలయాల ఖాతాల్లో జమ చేసినప్పటికీ మరికొందరు పూర్తి నిర్లక్ష్యంగా నిధులను జమ చేయడం లేదు. సెస్ కోసం గ్రంథాలయ సిబ్బంది గ్రామ పంచాయతీలకు వెళితే పెడచెవిన పెడుతున్నారే తప్ప జమ మాత్రం చేయడం లేదని ఆయా గ్రంథాలయాల సిబ్బంది పేర్కొంటున్నారు.



పోటీ పరీక్షలకు ప్రిపేర్ అవుతున్న నిరుద్యోగులు

---

## ఫ్లయింగ్ స్క్వాడ్ టీంలు పారదర్శకంగా పని చేయాలి

### కలెక్టర్ జితేష్ వి.పాటిల్





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ టీములు పారదర్శకంగా పని చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్లమెంట్ ఎన్నికల్లో అక్రమ మద్యం, డబ్బు, సరుకుల పంపిణీ జరిగినప్పుడు ఎస్ఎస్‌టీ, ఎస్ఎస్‌టీ బృందాలకు సమాచారం ఇచ్చిన వెంటనే వెళ్లి పట్టుకోవాలని సూచించారు. ఎన్నికల్లో రూ.50వేలకు మించి ఆధారాలు లేని డబ్బులను సీజ్ చేయాలని రూ.10లక్షలకు మించి డబ్బులు దొరికితే ఆదాయపన్ను శాఖ అధికారులకు అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డీవోలు రఘునాథరావు, ప్రభాకర్, తహసీల్దార్ జనార్ధన్ తదితరులు పాల్గొన్నారు.

#### సీఎంఆర్‌ను 29లోగా పూర్తయ్యేలా చూడాలి

ఎఫ్‌సీఐకి జిల్లాలోని రైస్‌మిల్లర్‌ల యజమానులు ఇవ్వాల్సిన బియ్యం టార్గెట్‌ను ఈనెల 29లోగా అందించేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ తెలిపారు. రోజువారి టార్గెట్ నిర్ధేశించుకుని టార్గెట్ పూర్తి చేయాలన్నారు. గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రైస్‌మిల్లుల యజమానులు రోజువారి లక్ష్యాలు పూర్తి చేయడానికి ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. లక్ష్యాలు పూర్తి చేయని మిల్లుల యజమానులపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లక్ష్యం పూర్తి చేయని మిల్లులను సీజ్ చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

#### కలెక్టర్‌ను కలిసిన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు

ఇటీవల నూతనంగా ఎన్నికైన చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాణిజ్య, వర్తక అంశాలపై కలెక్టర్‌తో చర్చించారు. కామారెడ్డి పట్టణానికి సంబంధించిన అన్ని వ్యాపార సంస్థలకు సహాయ సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు లింగం, ప్రధాన కార్యదర్శి సుకుమార్‌గౌడ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

---

చెక్‌పోస్టు ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న ఎస్పీ సింధూశర్మ



### ఇంటిగ్రేటెడ్ పోలీసు

## చెక్‌పోస్టును ప్రారంభించిన ఎస్పీ

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15: రహదారి భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ఇంటిగ్రేటెడ్ పోలీసు చెక్‌పోస్టును అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఎస్పీ సింధూశర్మ తెలిపారు. గురువారం ఇంటిగ్రేటెడ్ చెక్‌పోస్టును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 2013లో ఎన్‌హెచ్-44 అధికారుల అనుమతితో రోడ్డు ప్రమాదాల నివారణకు చెక్‌పోస్టును టెక్రియాల్ ఎక్స్‌రోడ్డు వద్ద ప్రారంభించినా మరమ్మతుల కారణంగా కొద్దిరోజుల తర్వాత నిరుపయోగంగా మారిందని తెలిపారు. తిరిగి ప్రారంభించామని ఇందులో రూరల్ సీఐ కార్యాలయంతో పాటు పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైని ఐపీఎస్ కాజల్‌సింగ్, అడిషనల్ ఎస్పీ కే. నరసింహారెడ్డి, డీఎస్పీలు ప్రకాష్, శ్రీనివాస్, మదన్‌లాల్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ జార్జ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

---

మాట్లాడుతున్న విద్యార్థి సంఘు నాయకులు



### గ్రామీణ భారత్ బంద్‌కు

## విద్యార్థి సంఘాల మద్దతు

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15: దేశంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ శుక్రవారం కార్మికులు, కర్షకులు నిర్వహిస్తున్న గ్రామీణ భారత్ బంద్‌కు వామపక్ష విద్యార్థి సంఘాలు సంపూర్ణ మద్దతును ప్రకటిస్తున్నామని తెలిపారు. గురువారం ఆర్అండ్‌బీ అతిథి గృహంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరించి ప్రైవేట్, కార్పొరేట్ పెట్టుబడిదారులకు కట్టబెడుతున్నదని తెలిపారు. విద్యారంగంలో శాస్త్రీయ, ప్రజాస్వామ్య, సోషలిస్టు భావాలను తొలగించి అశాస్త్రీయ, మూఢ నమ్మకాలను పాఠ్యాంశాలలో చేరుస్తూ విద్యా వ్యవస్థను పూర్తిగా కాషాయీకరించే కుట్రలకు పాల్పడుతున్నారని అందులో భాగంగానే నూతన విద్యావిధానం 2020ను తీసుకువచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో పరిశోధక విద్యార్థులకు ఇవ్వాల్సిన ఆర్‌జీఎన్ఎఫ్, మౌలానా అబుల్‌కలాం ఆజాద్ లాంటి ఫెలో షిప్పులను కుట్రపూరితంగా కుదించి నిలిపివేస్తు ఎస్‌సీ, ఎస్‌టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేస్తున్నారని ఆరోపించారు. ఈ బంద్‌కు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు అరుణ్, సురేష్, విఠల్, శివ, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

---

### కాంగ్రెస్‌లోకి..

# వలసల జోరు!

- జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ గూటికి క్యూ కడుతున్న బీఆర్ఎస్ శ్రేణులు
- ఇప్పటికే పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్ల చేరిక
- కామారెడ్డిలో చక్రం తిప్పుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త
- చేరికలపై ఆచితూచి అడుగులేస్తున్న కాంగ్రెస్

భిక్కనూరు, ఫిబ్రవరి 15: జిల్లా కాంగ్రెస్‌లోకి వలసల జోరు పెరిగింది. గత పదేళ్ల క్రితం కాంగ్రెస్ పార్టీకి చెందిన అప్పటి చాలా మంది ప్రజాప్రతినిధులను, ముఖ్యమైన నాయకులను టీఆర్ఎస్ పార్టీ చేర్చుకుని కాంగ్రెస్ పార్టీని ఇన్ని రోజులు జిల్లాలో కోలుకోలేని దెబ్బ తీసింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే జిల్లాలో రాజకీయాల్లో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఊహించని విధంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం, షబ్బీర్‌అలీ ప్రభుత్వ సలహాదారుగా నియామకం కావడంతో.. జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బీఆర్ఎస్‌పై రివెంజ్ మొదలు పెట్టిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కామారెడ్డి నుంచి రేవంత్‌రెడ్డి పోటీ ఖరారైనప్పటి నుంచే కాంగ్రెస్ పార్టీ ఆచితూచి అడుగులేస్తూ జిల్లా వ్యాప్తంగా బీఆర్ఎస్ నుంచి ఒక్కొక్కరిని కాంగ్రెస్‌లోకి చేర్చుకుంటూ రాజకీయాన్ని హీటెక్కిచ్చింది. కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి స్వల్ప మెజార్టీతో ఓడినా.. కాంగ్రెస్ బలం మాత్రం ఒక్కసారిగా పుంజుకుంది. గత ఎన్నికలకు ముందు బీఆర్ఎస్‌లో ఉన్న కామారెడ్డి మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ ఇందుప్రియ భర్త గడ్డం చంద్రశేఖర్ ఆ పార్టీలో జరిగిన గొడవల కారణంగా షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో భారీగా తన మద్దతుదారులతో చేరి బీఆర్ఎస్‌కు మొదటి షాక్ ఇచ్చారు. అప్పటి నుంచి మొదలైన ఈ చేరికలు రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తెలంగాణ రాష్ట్రం తమ వల్లనే ఏర్పాటైందని చెప్పుకుంటూ పదవులు అనుభవించిన బీఆర్ఎస్ నేతలు చాలా మంది ఒక్కొక్కరుగా కాంగ్రెస్ నేతలకు టచ్‌లోకి వెళ్లారు. కామారెడ్డిలో మున్సిపల్ కౌన్సిలర్‌లు, నాయకుల చేరికలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ భర్త, మరొక కౌన్సిలర్ భర్త చక్రం తిప్పుతూ బీఆర్ఎస్‌కు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. వీరితో పాటుగా మండలాల్లో ముఖ్య నాయకులు చేరికలపై కూడా తెర వెనుక వీరు ముఖ్యపాత్రను పోషిస్తున్నారు.

#### కాంగ్రెస్‌లోకి భారీగా చేరుతున్న మున్సిపల్ కౌన్సిలర్లు

కామారెడ్డి మున్సిపల్ పరిధిలో 49 వార్డులు ఉండగా 2018 మున్సిపల్ ఎన్నికల్లో ఎక్కువ మెజార్టీ స్థానాలను బీఆర్ఎస్ గెలుచుకుని ఛైర్మన్, వైస్ ఛైర్మన్ పదవులను సొంతం చేసుకుంది. ఎన్నికల సమయంలో 12 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు గెలువగా తదనంతరం 8 మంది కాంగ్రెస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్‌లో చేరారు. గత అసెంబ్లీ ఎన్నిక లకు ముందు కేవలం కాంగ్రెస్ పార్టీకి నలుగురు కౌన్సిలర్లు మాత్రమే ఉన్నారు. ఇదే ఎన్నికల ముందు బీఆర్ఎస్‌లో ఉన్న మున్సిపల్ వైస్ ఛైర్మన్ ఇందు ప్రియ భర్త గడ్డం చంద్రశేఖర్ రెడ్డి ఆ పార్టీ నాయకులతో గొడ వల కారణంగా బీఆర్ఎస్‌కు రాజీనామా చేసి వైస్ ఛైర్మన్‌తో పాటుగా కాంగ్రెస్‌లో చేరడం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో కౌన్సిలర్లు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ గూటిలో చేరుతున్నారు. దీంతో కాంగ్రెస్‌లోని కౌన్సిలర్ల సంఖ్య నలుగురు నుంచి ప్రస్తుతం 21కి చేరుకుంది. మరికొంత మంది కౌన్సిలర్లు సైతం కాంగ్రెస్‌లో చేరడానికి సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. దీనిని బట్టి కాంగ్రెస్‌లోకి చేరికలు ఎంత వేగంగా జరుగుతున్నాయో అర్థమవుతుంది. దీనికి తోడు ఛైర్‌పర్సన్‌పై కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్లు అవిశ్వాసం పెట్టనున్నట్లు సమాచారం.



షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న బీఆర్ఎస్ కౌన్సిలర్లు ( ఫైల్ )

#### కాంగ్రెస్ నాయకులకు టచ్‌లో జడ్పీటీసీలు, ఎంపీపీలు, ఇతర ప్రజాప్రతినిధులు

కామారెడ్డి జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు ముమ్మరమయ్యాయి. అసెంబ్లీ ఎన్నికల ముందే జిల్లావ్యాప్తంగా పలువురు ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డుసభ్యులు, విండో ఛైర్మన్లు కాంగ్రెస్‌లో చేరారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో జిల్లాలోని చాలా మంది ఎంపీపీలు, జడ్పీటీసీలు, పలువురు ప్రజాప్రతినిధులు కాంగ్రెస్ నాయకుల టచ్‌లోకి వెళ్లి చేరికల కోసం సంప్రదింపులు ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం.

#### చేరికలపై ఆచితూచి వ్యవహరిస్తున్న కాంగ్రెస్

గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో నుంచి కాంగ్రెస్‌లోకి చేరుతామని కాంగ్రెస్ నాయకులను నమ్మించి చివరి నిమిషంలో చేరకుండా నమ్మకద్రోహం చేసిన వారు ప్రస్తుతం కాంగ్రెస్‌లో చేరడానికి ప్రయత్నాలు చేస్తున్నారని, అలాంటి వారిని ఎట్టి పరిస్థితుల్లో పార్టీలో చేర్చుకునేది లేదని కాంగ్రెస్‌లోని ముఖ్యనాయకులు, కార్యకర్తలు అధిష్టానానికి హెచ్చరికలు జారీ చేసినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాంటి వారిని చేర్చుకుంటే పార్టీని పూర్తిగా భ్రష్టుపట్టిస్తారని, పార్టీలో వారి డామినేషనే ఎక్కువగా ఉంటుందని, అలాంటి వారితో గత పది సంవత్సరాలుగా ఎన్నో అణిచివేతలు, ఒడిదుడుకులు ఎదుర్కొని పార్టీ కోసం, పార్టీ గెలుపు కోసం పని చేసిన పార్టీ కార్యకర్తలకు, నాయకులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. దీంతో పార్టీ అధిష్టానం సైతం ఆచితూచి వ్యవహరిస్తోంది. ప్రజల్లో వ్యతిరేకత ఉన్న వారిని కాకుండా ప్రజల్లో పేరుండి ఆయా మండలాల్లో కార్యకర్తలను, ముఖ్య నాయకులతో చర్చించి వారు ఒకే అన్న తర్వాతనే చేరికలకు లైన్ క్లియర్ చేస్తోంది.

## టీయూలోని సమస్యలను పరిష్కరించాలి: పీడీఎస్‌యూ

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15: తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్ డిమాండ్ చేశారు. గురువారం వర్సిటీ కళాశాల ఎదుట పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ఆందోళన చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రం రిజిస్ట్రార్ యాదగిరికి అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు మాట్లాడుతూ వర్సిటీలో బాలికల హాస్టల్ సరిపోక అనేక ఇబ్బందులు పడుతున్నారని, నూతన హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. టీయూలో హెల్త్ కేర్ సెంటర్, అంబులెన్స్ ఏర్పాటు చేయాలని, మెస్ బిల్లులకు నిఘా ఉంచాలని పేర్కొన్నారు.







# రూ.50 కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యం పక్కదారి

● రైస్‌మిల్లు యజమానిపై కేసు నమోదు

కోటగిరి,ఫిబ్రవరి15: రూ.50కోట్ల విలువ చేసే సీఎంఆర్ ధాన్యాన్ని పక్కదారి పట్టించిన రైస్‌మిల్ యజమానిపై నిజామాబాద్ జిల్లా కోటగిరి పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే.. కోటగిరి మండలం కారేగాం గ్రామంలోని ఆర్యం ఇండస్ట్రీస్ యాజమాన్యం 52కోట్ల రూపాయలకుపైగా ధాన్యాన్ని మిల్లింగ్ కోసం తీసుకుంది. 2001-22 ఖరీఫ్, 2022-23 రబీ సీజన్‌లో సివిల్ సప్లై ద్వారా ధాన్యం తీసుకుంది. తీసుకున్న ధాన్యాన్ని మిల్లింగ్ చేసి ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉండగా.. రైస్‌మిల్లు యాజమాన్యం నిర్లక్ష్యంగా వ్యవహరించింది. ఇటీవల జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు ధాన్యాన్ని పక్కదారి పట్టించారన్న ఆరోపణల నేపథ్యంలో.. పౌర సరఫరాల శాఖ అధికారులు ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్యం ఇండస్ట్రీలో తనిఖీలు నిర్వహించగా.. ధాన్యం మాయమైనట్లు అధికారులు గుర్తించారు. సుమారు 2 కోట్లకుపైగా సీఎంఆర్ ధాన్యాన్ని మాత్రమే సివిల్ సప్లైకి అప్పగించినట్లు తేలింది. మిగిలిన రూ.50కోట్ల విలువ చేసే ధాన్యం లేకపోవడంతో.. అధికారులు రైస్‌మిల్ యజమాన్యంపై చర్యలు చేపట్టారు. ఈవిషయమై జిల్లా సివిల్ మేనేజర్ జగదీష్ ఈనెల 10వ తేదీన కోటగిరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్యాం ఇండస్ట్రీస్ యాజమాని సాయిరాంపై ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు సంబంధిత యజమానిపై 406, 409, 417, 420 సెక్షన్‌ల కింద కేసు నమోదు చేసినట్లు ఎస్సై సందీప్ గురువారం తెలిపారు. పూర్తిస్థాయి విచారణ జరిపి యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

## నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

● బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ

రెంజల్, ఫిబ్రవరి 15: గత ప్రభుత్వాలు చేసిన తప్పిదాలే ఈ ప్రభుత్వం చేయకుండా నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ తెరిపించి కార్మికులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను నిలువున మోసం చేసిన ఘనత కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలదేనని అన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మొదటగా అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే ఫ్యాక్టరీని తెరిపించి పూర్వవైభవం తీసుకువస్తాని మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చి ఫ్యాక్టరీ కార్మికుల పొట్టలు కొట్టారని అన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా కార్మికులను నిలువునా ముంచారని, మళ్లీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ అయినా నిజాంషుగర్స్ ఫ్యాక్టరీ కార్మికులను ఆదుకోవాల్సిన బాధ్యత కాంగ్రెస్‌పై ఉందని ఆయన అన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఎద్దేవాచేశారు. బీఆర్‌ఎస్ పాలనలో అక్రమ ఇసుక రవాణా చేపట్టి ప్రభుత్వ అధికారులపై దాడులు చేసి ఖండ్‌గావ్ గ్రామానికి చెందిన కాందారుని దౌర్జన్యంగా చితకబాదారని గుర్తుచేశారు. నాడు బీఆర్‌ఎస్ అధికారంలో ఉండి అక్రమంగా ఇసుక రవాణా చేయగా.. నేడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కూడా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతుందని అన్నారు. అక్రమ ఇసుక రవాణాను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, మాజీ మండల అధ్యక్షుడు మేక సంతోష్, కిషోర్, బీజేపీ నాయకులు న్యావనంది గోపాల్, పోచయ్య, రమేష్ తదితరులున్నారు.

## నెంబర్‌ప్లేట్ లేని బైక్‌లు సీజ్

ముప్కాల్, ఫిబ్రవరి 15: నెంబర్ ప్లేటు లేని బైక్‌లను తాత్కాలికంగా సీజ్‌చేసి జరిమానా విధించినట్లు ఎస్సై బాస్కరచారి తెలిపారు. గురువారం ముప్కాల్ మండలకేంద్రంలోని గాంధీచౌరస్తా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. తనిఖీల్లో నెంబర్ ప్లేట్ లేని 10 బైక్‌లను తాత్కాలిక సీజ్ చేసి జరిమానా వేసి నెంబర్ ప్లేటు పెట్టించిన తర్వాతే ఆ బైక్‌లను వారికి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు. నెంబర్ ప్లేట్ లేకుండా తప్పుడు నెంబర్‌లకు దొంగతనాలకు పాల్పడుతున్నారని, ప్రతీఒక్కరు తమ వాహనాలకు నెంబర్‌ప్లేట్ ఉంచాలని సూచించారు. వాహనదారులు హెల్మెట్ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్‌లలో ప్రయాణించడం ప్రమాదకరమని వాహనదారులకు అవగాహన కల్పించారు.





## ఎస్ఆర్ఎన్‌కే కళాశాలకు స్వయం ప్రతిపత్తి


హోదా గుర్తింపు పత్రాన్ని అందుకుంటున్న కళాశాల ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి 15: తెలంగాణ యూనివర్సిటీ పరిధిలోని బాన్సువాడలో గల ఎస్ఆర్ఎన్‌కే డిగ్రీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పించిన ఆర్డర్ కాపీని గురువారం వర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి కళాశాల యాజమన్యానికి అందజేశారు. ఈ గుర్తింపు 2024-25 విద్యాసంవత్సరానికి వర్తిస్తోందని, యూజీసీ నుంచి గుర్తించబడిందని రిజిస్ట్రార్ ఒక ప్రకటనలో తెలిపారు. అటానమస్ గుర్తింపుతో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్యాబోధనతోపాటు సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రానుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. గంగాధర్, అధ్యాపకులు విఠల్, కృష్ణ పాల్గొన్నారు.

## నకిలీ విలేకర్లను పోలీసులకు పట్టించిన గౌడ సంఘం ప్రతినిధులు

డిచ్‌పల్లి, ఫిబ్రవరి15: మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో గల కల్లు బట్టిలో డబ్బులు ఇవ్వాలని బెదిరింపులకు గురిచేసిన నకిలీ విలేకర్లను గౌడ సంఘం ప్రతినిధులు పట్టుకొని గురువారం డిచ్‌పల్లి పోలీసులకు అప్పగించారు. గత రెండు రోజులుగా కల్లుబట్టి నిర్వాహకులను డబ్బులు ఇవ్వాలని వేధింపులకు గురిచేసిన డిచ్‌పల్లికి చెందిన గంగాధర్, ఆర్మూర్‌కి చెందిన సాయిప్రణీత్‌లపై గౌడ కులస్థులు పోలీసులకు సమాచారం అందించారు. గౌడ ప్రతినిధులు వారిని నిలదీసి తమపై దాడి చేస్తున్నారని ముందస్తుగా డయల్ 100కు సమాచారం చేరవేసి పోలీసులకు అప్పగించారు.

## జాతీయస్థాయి పోటీలకు గురుకుల పాఠశాల విద్యార్థిని ఎంపిక


రెంజల్, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని మైనారిటీ రెసిడెన్షియల్ పాఠశాలకు చెందిన విద్యార్థిని కీర్తన అథ్లెటిక్ విభాగం షాట్‌పుట్‌లో రాష్ట్రస్థాయిలో సత్తాచాటి జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది. దీంతో గురువారం విద్యార్థిని కీర్తనను పాఠశాల ప్రిన్సిపాల్ హర్షియా నాజం, వ్యాయామ ఉపాధ్యాయురాలు భాగ్యశ్రీ అభినందించారు. ఈనెల 16నుంచి 18వరకు గుజరాత్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి పోటీలలో విద్యార్థిని కీర్తన పాల్గొననుందని తెలిపారు.

## ఆర్టీఏ డీటీసీ వెంకటరమణ బదిలీ

● నూతన డీటీసీగా దుర్గాప్రమీల

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి15: జిల్లా రవాణాశాఖ డీటీసీగా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ కె.వెంకటరమణ బదిలీ అయ్యారు. ఆయనను సంగారెడ్డి డీటీసీగా నియమించారు. ఆయన స్థానంలో మహబూబ్‌నగర్‌లో డీటీసీగా విధులు నిర్వహిస్తున్న దుర్గాప్రమీళను నియమించారు. దుర్గాప్రమీళ స్థానంలో సంగారెడ్డి డీటీసీగా ఉన్న శివలింగయ్యను బదిలీ చేశారు. వెంకటరమణ 7 జనవ 2021న డీటీసీగా బాధ్యతలు చేపట్టారు. నాలుగేళ్ల సర్వీసు పూర్తికావడంతో ఆయనను బదిలీచేశారు. ఎంవీఐ యశ్వంత్‌ను ఆదిలాబాద్‌కు బదిలీచేశారు. ఆయన స్థానంలో ఉమామహేశ్వరరావుకు నిజామాబాద్‌కు బదిలీచేశారు. ఇద్దరు అధికారులు కూడా చార్జి తీసుకోలేదు. డీటీసీ వెంకటరమణ ఎంవీఐ కిరణ్‌కు ప్రస్తుతం చార్జి అప్పజెప్పి సంగారెడ్డికి వెళ్లారు. దుర్గాప్రమీళ గతంలో నిజామాబాద్‌లో డీటీవోగా రెండేళ్లు విధులు నిర్వహించారు.

## బోధన్ పట్టణ అభివృద్ధికి కృషి: కమిషనర్


బాధ్యతలు స్వీకరిస్తున్న కమిషనర్

బోధన్ రూరల్, ఫిబ్రవరి15: బోధన్ మున్సిపల్ కమిషనర్‌గా వెంకటనారాయణ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన ఖమర్ అహ్మద్ ఆదిలాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన వెంకటనారాయణ బోధన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బోధన్ పట్టణాన్ని జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. పట్టణంలోని అన్ని వార్డులలో పర్యటిస్తారని, ప్రజా సమస్యలను తెలుసుకుని ఎప్పటికప్పుడు పరిష్కరిస్తానన్నారు. పట్టణ అభివృద్ధికి బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మ శరత్‌రెడ్డితో పాటు వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు ప్రతీఒక్కరు సహకరించాలన్నారు. అనంతరం బోధన్ మున్సిపల్ చైర్‌పర్సన్ తూము పద్మశరత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

## శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి: ఏసీపీ

బోధన్‌రూరల్, ఫిబ్రవరి15: బోధన్ డివిజన్‌లో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతీఒక్కరు సహకరించాలని బోధన్ ఏసీపీ పి.శ్రీనివాస్ అన్నారు. గురువారం బోధన్ ఏసీపీ కార్యాలయంలో ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఏసీపీగా విధులు నిర్వహించిన కిరణ్‌కుమార్ హైదరాబాద్ డీజీపీ కార్యాలయానికి బదిలీ అయ్యారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతిఒక్కరు సహకరించాలని ఆయన అన్నారు. అక్రమ ఇసుక, గంజాయిని అరికడతామని ఆయన పేర్కొన్నారు. శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా డివిజన్‌లోని సీఐలు, ఎస్సైలు ఏసీపీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## 'విజయోత్సవ ర్యాలీకి తరలిరావాలి'

నందిపేట, ఫిబ్రవరి15: ఎమ్మెల్సీగా ఎన్నికైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులుగా నియమితులైన మహ్మద్ షబ్బీర్ అలీ జిల్లాకు మొదటిసారిగా వస్తున్న సందర్భంగా శుక్రవారం నిజామాబాద్‌లో ఏర్పాటు చేయనున్న విజయోత్సవ ర్యాలీకి తరలిరావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు కోరుతూ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. బోర్గాం నుంచి ప్రగతీనగర్‌లోని మున్నూర్‌కాపు కళ్యాణ మండపం వరకు బైక్ ర్యాలీ ఉంటోందని, అనంతరం అభినందన సభ జరుగుతోందని తెలిపారు. కార్యక్రమానికి జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని డీసీసీ ఉపాధ్యక్షుడు పెంట ఇంద్రుడు కోరారు.

## రూరల్ డీటీగా వినయ్‌సాగర్

నిజామాబాద్ రూరల్, ఫిబ్రవరి 15: రూరల్ మండల డిప్యూటీ తహసీల్దార్‌గా వినయ్‌సాగర్ బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు రూరల్ డీటీగా విధులు నిర్వహించిన రంజిత్‌కుమార్ నిర్మల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో జగిత్యాలలో డీటీగా విధులు నిర్వహిస్తున్న వినయ్‌సాగర్‌కు ఇక్కడకు బదిలీచేశారు. గురువారం ఆయన రూరల్ తహసీల్దార్ జి.అనురుద్‌ను కలసి విధుల్లో చేరారు.

## కబడ్డీ పోటీలకు కేటీఎస్ విద్యార్థి ఎంపిక

ముప్కాల్, ఫిబ్రవరి15: బాల్కొండ మండల కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాల విద్యార్థి సిహెచ్.రాజు రాష్ట్రస్థాయి అండర్-16 జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కర్తన్ తెలిపారు. జరిగే నేటి నుంచి రెండు రోజుల పాటు నల్గొండ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలో విద్యార్థిని సీహెచ్.రాజు పాల్గొనున్నారు. ఈనెల 7న ముప్కాల్‌లో నిర్వహించిన సెలక్షన్ పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో జిల్లాజట్టులో పాల్గొనేందుకు ఎంపికైనట్లు తెలిపారు.

## జుక్కల్ సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించిన ఎమ్మెల్యే


అసెంబ్లీలో మాట్లాడుతున్న జుక్కల్ ఎమ్మెల్యే తోట

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 15: జుక్కల్ నియోజకవర్గ సమస్యలపై గురువారం అసెంబ్లీలో జరిగిన చర్చ కార్యక్రమంలో భాగంగా జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంత్‌రావ్ పలు సమస్యలను సభ దృష్టికి తీసుకవచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తోట మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గం చాలా వెనుకబడి ఉందని, నిజాంసాగర్ ప్రాజెక్ట్ జుక్కల్ నియోజకవర్గంలోనే ఉన్నా సాగు నీటి సౌకర్యం చాలా తక్కువగా ఉందని, సాగు నీటి సమస్య తీర్చేందుకు 2021లో నాగమడుగు ప్రాజెక్ట్ నిర్మిస్తున్న పనులు నత్తతో పోటీ పడుతున్నాయని వివరించారు. ఇది పూర్తయితే 45 వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. ముఖ్యంగా నియోజకవర్గంలో ప్రభుత్వ ఆసుపత్రులలో సిబ్బంది కొరత మరీ తీవ్రంగా ఉందని, బిచ్కుంద మండల కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఉన్నా ఒక్క మెడికల్ ఆఫీసర్ ఉన్నారని తెలిపారు. అంతేగాక అంతరాష్ట్ర ప్రాజెక్ట్ లెండి 2003 సంవత్సరంలో ప్రారంభం అయినా ఇంకా పెండింగ్‌లో ఉందని, ఇది పూర్తయితే మద్నూర్, బిచ్కుంద మండలాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దీంతో పాటుగానే సంగారెడ్డి నుంచి మద్నూర్ వరకు 161 జాతీయ రహదారి ఉందని సుమారు 130 కిలో మీటర్ల మేర రహదారి నిర్మాణం తర్వాత ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని, ప్రమాదాల బారిన పడిన వారి కోసం చికిత్స చేసేందుకు కనీసం ట్రామాకేర్ సెంటర్ లేదని తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఒక ట్రామాకేర్ సెంటర్ మంజూరు చేయాలని సంబంధిత మంత్రిని కోరారు. ఇక మరో చిన్న నీటి సాగు వనరు అయిన కౌలాస్‌నాలా ప్రాజెక్ట్ అందుబాటులో ఉన్న పూడిక, పిచ్చి మొక్కలతో నిండి ఉందని దీనిని బాగు చేసేందుకు నిధులు ఇవ్వాలని సంబంధిత మంత్రిని కోరారు.

## నర్సరీలను పరిశీలించిన ఎంపీవో రాము

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 15 : మండలంలోని నెమ్లి, అంకోల్ క్యాంప్ గ్రామాల్లో గురువారం ఎంపీవో రాము నర్సరీలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నర్సరీల్లో మొక్కలు పెరిగేలా ఎప్పటికప్పుడు నీరు అందించాలని, స్థానిక గ్రామ సెక్రెటరీకి, ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా పర్బన్న

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 15: నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా టి.పర్బన్న గురువారం పదవీ బాధ్యతలు చేపట్టారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా నిజామాబాద్ జిల్లా బోధన్ ఎంపీడీవోగా విధులు నిర్వహిస్తున్న పర్బన్నను ఉన్నతాధికారులు నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా బదిలీ చేశారు. ఇది వరకు నాగిరెడ్డిపేట ఎంపీడీవోగా పని చేసిన రఘు మెదక్ జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీవోగా బాధ్యతలు చేపట్టిన పర్బన్నను స్థానిక ఎంపీపీ రాజ్‌దాస్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పీఎం కిసాన్ పథకానికి ఈకేవైసీ చేసుకోవాలి

నాగిరెడ్డిపేట, ఫిబ్రవరి 15 : పీఎం కిసాన్ పథకంలో లబ్ధిదారులందరూ ఈకేవైసీ తప్పనిసరి చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి విజయ్ శేఖర్ రైతులను కోరారు. ఈకేవైసీ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమంలో భాగంగా గురువారం మండలంలోని ధర్మారెడ్డి, తాండూరు, పోచారం గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ఈకేవైసీ చేసుకుని రైతుల ద్వారా ఈకేవైసీ చేయించామన్నారు. మండలంలో ఇంకా 175 మంది రైతులు ఈ కేవైసీ చేసుకోవాల్సి ఉందన్నారు. ఈకేవైవైసీ చేసుకోలేని రైతులకు 16వ విడత రెండు వేల రూపాయల నగదు జమ అవ్వదని ఆయన తెలిపారు. ఈకేవైసీ కోసం ఏఈవోలను సంప్రదించాలని లేదా సీఎస్సీ సెంటర్‌లో ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని ఆయన రైతులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు నిఖిత, భభిత, ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.


డిప్యూటీ తహసీల్దార్‌కి వినతిపత్రం అందజేస్తున్న బంజారా నాయకులు

## బంజారా భవన్ కోసం స్థలాన్ని ఇవ్వాలి

నసురుల్లాబాద్, ఫిబ్రవరి 15: మండల పరిధిలోని వివిధ గ్రామాల బంజారా నాయకులు, యువకులు గురువారం మండల బంజారా భవన్ స్థలం కోసం తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ బావయ్యకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా బంజారా నాయకులు మాట్లాడుతూ బంజారా భవన్ కోసం స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులను కోరడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సాయిరాం, దశరథ్, విఠల్, రాందాస్, నగేష్, మండల పరిధిలోని వివిధ తండాల ప్రజలు, యువకులు, తండా పెద్దలు పాల్గొన్నారు.

## హరితహారాన్ని నిర్లక్ష్యం చేయొద్దు

సదాశివనగర్ ఫిబ్రవరి 15: హరితహారం సంరక్షణలో సిబ్బంది ఎలాంటి నిర్లక్ష్యం చేయవద్దని ఎంపీడీవో సంతోష్‌కుమార్ అన్నారు. ఇంత వరకు నాటిన మొక్కలను ఏ మాత్రం నిర్లక్ష్యం చేయకుండా ప్రతీ మొక్కకు నీరు అందించి పచ్చదనాన్ని పరిరక్షించాలని తెలిపారు. నర్సరీల్లో గృహ అవసరాలకు కావాల్సిన మొక్కలతో పాటు అవెన్యూ ప్లాంటేషన్‌కు సంబంధించిన నీడనిచ్చే మొక్కలను పెంచి పోషించి సిద్ధం చేయాలని సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సురేందర్ రెడ్డి, ఏపీవో మధునాయక్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తి శ్రద్ధలతో సేవాలాల్ మహరాజ్ జయంతి


పెద్దకొడప్‌గల్‌లో ఆలయం ముందు పూజలు చేస్తున్న గిరిజనులు

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 15: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల తండాల్లో గురువారం గిరిజనులు ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. సేవాలాల్ మహరాజ్ జయంతిని పురస్కరించుకుని వేకువ జామునే జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయాలను శుభ్రం చేశారు. అనంతరం ఆలయానికి సంబంధించిన పూజారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోగ్ భండార్ కార్యక్రమంలో భాగంగా సిరా నైవేద్యం చేసి స్వామి వారికి అర్పించారు. ఆలయం ముందు పూజ కార్యక్రమానికి హాజరైన గిరిజనులు అంతా ఒక చోట చేరి సేవాలాల్ మహరాజ్‌కు మొక్కులు చెల్లిస్తారు. తమ తండా ప్రజలతో పాటు ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, చక్కని పంటలు పండాలని కోరుతూ ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

**బాన్సువాడ టౌన్:** తపస్ బాన్సువాడ శాఖ ఆధ్వర్యంలో సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ సేవాలాల్ మహరాజ్ యావత్ బంజారాలను హిందూ ధర్మం వైపు, గోవులను రక్షించుటలో ప్రభావితం చేసిన గొప్ప మహనీయులన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ జిల్లా నాయకులు బాల్‌రాజ్, వేద్‌ప్రకాశ్, కిష్టయ్య, నర్సన్న, శ్రీకాంత్‌రెడ్డి, సాయిలు, దశరథ్, నరేందర్, కృష్ణ, నరసింహాచారి తదితరులున్నారు.

**నసురుల్లాబాద్:** మండల కేంద్రంలో గిరిజన గురుకుల పాఠశాల విద్యార్థులు వివిధ తండాల బంజారా యువకులు మండల కేంద్రంలో గురుకుల పాఠశాల నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బంజారా నాయకులు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

**బీర్కూర్:** మండలంలోని తిమ్మాపూర్ తండా, బీర్కూర్ తండా, సాంబాపూర్ తదితర గ్రామాల్లో సేవాలాల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు.యావత్ భారతదేశం గర్వించదగ్గ ఆధ్యాత్మికవేత్త సేవాలాల్ మహరాజ్ అని అభివర్ణించారు ఈ కార్యక్రమంలో గిరిజన నాయకులు, గిరిజనులు పాల్గొన్నారు.

**నాగిరెడ్డిపేట:** మండలంలోని పల్లెబోగూడ తండాలో జడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సేవాలాల్ చిత్ర పటానికి నివాళ్లు అర్పించాలి.

**లింగంపేట:** మండల కేంద్రంలోని బంజార సంఘం వద్ద సేవాలాల్ జయంతిని నిర్వహించి, బోగ్ బండార్, భవానీ మాతాకు గిరిజనులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా బంజారా సంఘం మండల అధ్యక్షుడు గన్ను నాయక్ బంజారా జాతిని సన్మార్గంలో నడిపించేందుకు సేవాలాల్ మహరాజ్ అవతరించారని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పీర్‌సింగ్, ఈశ్వర్, విఠల్, అమిర్యానాయక్, సక్రు, జగ్యాలతో పాటు మండలంలోని వివిధ తండాలకు చెందిన గిరిజనులు ఉన్నారు.

**కామారెడ్డి టౌన్:** సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోతీసింగ్ అన్నారు. గురువారం కామారెడ్డి జిల్లా కేంద్రంలో సేవాలాల్ మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంచార జాతులుగా తిరుగుతూ పాలకులకు బానిసగా వెట్టిచాకిరికి గురైన లంబాడాలను ఐక్యం చేయడంలో సేవాలాల్ మహరాజ్ కృషి ఎనలేనిదని అన్నారు. ఈ కార్యక్రమంలో బంజరా నాయకులు గణేష్‌నాయక్, రాణాప్రతాప్‌రాథోడ్, మోతీరాం, ప్రవీణ్‌నాయక్, డాక్టర్ శ్రీకాంత్, చరణ్‌నాయక్, సేటియా నాయక్, బలరాంనాయక్, లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**గాంధారి:** మండలంలో సేవాలాల్ ఆలయం వద్ద గిరిజనులు భోగ్‌బండార్ నిర్వహించారు. గిరిజనులకు అత్యంత పవిత్రమైన సేవాలాల్ జయంతిని అన్ని తండాల్లోని ప్రజలు పెద్దఎత్తున జరుపుకొన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శంకర్‌నాయక్, బలరాంనాయక్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, ముజీరాం నాయక్, భాగ్యనాయక్, ప్రేమ్‌సింగ్, పరశురాం తదితరులు పాల్గొన్నారు.

**నిజాంసాగర్:** గిరిజనులతో పాటు అందరి ఆరాధ్య దైవం సేవాలాల్ అని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. గురువారం నిజాంసాగర్ మండల కేంద్రంలో, తుంకిపల్లి తండాలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు దశదిశను చూపి, హైందవధర్మం గొప్పదనం, విశిష్టతలను తెలియజేయడానికే సేవాలాల్ మహరాజ్ జన్మించారని అన్నారు. బంజారా జాతి ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింస సిద్ధాంతానికి పునాదులు వేశారని వెల్లడించారు. ప్రతి ఒక్కరూ మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలని సూచించారు. గిరిజనుల అభివృద్ధికి సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

**రామారెడ్డి:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ గిరిజనులకు చేసిన సేవలను అధ్యాపకులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మధుశ్రీవాత్సవ, రాజు, రాజాగౌడ్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

**ఎల్లారెడ్డి:** బంజారాల హక్కులతో పాటు ధర్మం, గోసం రక్షణ సమాజాభివృద్ధికి పాటుపడిన సంత్ సేవాలాల్ మహరాజ్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని ఆయన బాటలోనే నడవాలని బీజేపీ రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి అన్నారు. సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా గురువారం ఎల్లారెడ్డి మండలంలోని హాజీపూర్ తండాలో ఏర్పాటు చేసిన సేవాలాల్ జయంతి బోగ్ బండార్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తండా పెద్దలు, యువకులు కుమార్, మహిపాల్, జీవన్, అనిల్, పరశురాం, బన్సీలాల్, రమేష్ దేవీసింగ్, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

**బిచ్కుంద:** సంత్‌సేవాలాల్ మహరాజ్ చూపిన విధంగా ప్రతి ఒక్కరు చెడుమార్గాన్ని వీడి సన్మార్గంలో నడవాలని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. గురువారం మండలంలోని ఎల్లారం గ్రామంలో గిరిజనుల ఆరాధ్యదైవం సంత్‌సేవాలాల్ జయంతిలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జహీరాబాద్ మాజీ ఎంపీ సురేష్‌షెట్కార్, కాంగ్రెస్ నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.


బాన్సువాడలో..


కామారెడ్డిలో..


నాగిరెడ్డిపేటలో..

# జిల్లా వ్యాప్తంగా గౌడ సమస్యలను పరిష్కరిస్తాం

పెద్ద కొడప్‌గల్, ఫిబ్రవరి 15: జిల్లా వ్యాప్తంగా ఉన్న గౌడ కులస్థుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జై గౌడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీ గౌడ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో జిల్లా జై గౌడ సంఘం ఉపాధ్యక్షులు పండరి గౌడ్ అధ్యక్షతన జైగౌడ క్యాలెండర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీగౌడ్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న గౌడ సోదరుల సంక్షేమం కోసం జై గౌడ కమిటీ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైగౌడ నాయకులు విఠల్ గౌడ్, శంకర్‌గౌడ్, బాలాగౌడ్, సిద్దా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


జై గౌడ క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

### జైగౌడ ఉద్యమ సంఘం క్యాలెండర్ ఆవిష్కరణ

బాన్సువాడటౌన్: జైగౌడ ఉద్యమ సంఘం 2024 క్యాలెండర్‌ను గురువారం బాన్సువాడ రూరల్ సీఐ సత్యనారాయణగౌడ్ ఆవిష్కరించారు. అనంతరం జైగౌడ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మురళీగౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘ సభ్యులకు ఏ కష్టం వచ్చినా ముందుండి పోరాడతామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్ , ప్రకాశ్‌గౌడ్ , సాయి గౌడ్ , ప్రవీణ్‌గౌడ్ తదితరులున్నారు.

## 'ట్రాన్స్‌జెండర్లకు రక్షణ కల్పించాలి'

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ జిల్లాలోని ట్రాన్స్‌జెండర్లపై జరుగుతున్న దాడులను అరికట్టాలని వారికి రక్షణ కల్పించాలని సీపీ ఎం, సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.కిరణ్‌కుమార్‌ను కలిసి గురువారం వినతిపత్రం అందించారు. తమకు రక్షణ కల్పించాలని వారు కోరారు. ట్రాన్స్‌జెండర్లపై దాడులు గత కొంత కాలంగా కొనసాగుతున్నాయని వాటిని అరికట్టాలని కోరారు. ఎక్కడ ఎవరు దాడి చేస్తారోనని ట్రాన్స్‌జెండర్లు ఆందోళన చెందుతున్నారని వారు అదనపు కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్‌తో పాటు ట్రాన్స్‌జెండర్ల నాయకులు గంగ, జరీనా, అలక, రక్ష, ఆరతి, ప్రియ, తదితరులు పాల్గొన్నారు.

### నిజామాబాద్ జిల్లాకు కొత్తగా రెండు కోర్టుల మంజూరు

నిజామాబాద్ లీగల్, ఫిబ్రవరి 15: తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు నిజామాబాద్ జిల్లాలో మరో రెండు కోర్టులు ఏర్పాటు చేసేందుకు అనుమతి ఇచ్చినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల తెలిపారు. అడిషనల్ సీనియర్ సివిల్ కోర్టు కం అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు మరియు 5వ అదనపు జుడిషియల్ మొదటి తరగతి మెజిస్ట్రేట్. ఈ రెండు నూతన కోర్టులను ఈ నెల 17న శనివారం ఉదయం 10.30 గంటలకు నిజామాబాద్ అడ్మినిస్ట్రేటివ్ జడ్జి హైకోర్టు, హైకోర్టు న్యాయాధికారి జస్టిస్ ఎస్.తుకారాం చేతుల మీదుగా ప్రారంభిస్తారు. జిల్లాలో పెండింగ్ కేసులు అధికంగా ఉండటంతో ఈ కొత్త కోర్టులను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ అదనపు కోర్టులతో కేసులు త్వరితగతిన పూర్తికానున్నాయి.

## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు

నిజామాబాద్ అర్బన్, ఫిబ్రవరి 15: నిజామాబాద్ నగరానికి చెందిన ఇద్దరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు పంచరెడ్డి నర్సుబాయి సూరి, మృదుల అరుణ్‌లు మాజీ మంత్రి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరితో పాటు మాజీ కార్పొరేటర్లు కొండపాక రాజేష్, బొబ్బిలి మురళి, పురుషోత్తం కూడా కాంగ్రెస్‌లో చేరారు. వీరితో పాటు బీఆర్ఎస్ నేతలు ప్రభు, సన్నబాలాజీ, నర్సింహ, నాయిని సృజన్, పుప్పాలరవి, మాకు రవి, బీఎల్ రాజు, పసుపుల సురేష్, అనిల్‌యాదవ్, గంపరాజులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత, నిజామాబాద్ నగర అధ్యక్షుడు కేశవేణు, నరాల రత్నాకర్, యువజన కాంగ్రెస్ నేత రామర్తిగోపి, నరాల నీహాల్, రాంబూపాల్, విజయ్‌పాల్, గంగాధర్, ధర్పల్లి అశోక్, కిషన్, అఫ్జల్, పవన్‌కుమార్‌లు పాల్గొన్నారు.


నర్సరీని పరిశీలిస్తున్న పీడీ పద్మజ రాణి

## నర్సరీలో వందశాతం మొక్కలు పెంచాలి

రాజంపేట,ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని నర్సరిని పీడీ పద్మజ రాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలోని నర్సరీలలో మొక్కలు 100శాతం పెంచాలని పంచాయతీ కార్యదర్శులకు, ఫిల్డ్ అసిస్టెంట్‌లకు సూచించారు. పూల మొక్కలు పెంచాలని మొక్కల పెంపకంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ రామన్‌రావు, టీఏ భాస్కర్, రాజు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

## బస్వాపూర్‌లో కాంగ్రెస్ ఫ్లెక్సీ చింపివేత

● పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నాయకులు

భిక్కనూరు, ఫిబ్రవరి 15: మండలంలోని బస్వాపూర్ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ జన్మదినాన్ని పురస్కరించుకుని గ్రామ కాంగ్రెస్ నాయకులు ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను గుర్తుతెలియని వ్యక్తులు చించివేయడంతో గురువారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకుల కథనం ప్రకారం.. గ్రామంలో రాత్రి వేళ ఒక యువకుడి వివాహ భరత్‌లో భాగంగా కొందరు యువకులు నృత్యాలు చేస్తూ మద్యం తాగి తమ అభిమాన నాయకుడు షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చించివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫ్లెక్సీలను ఎవరెవరు చింపివేశారో గ్రామంలోని సీసీ కెమెరాల్లో నమోదయ్యాయని, పోలీసులు వారిని వెంటే గుర్తించి కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బస్వాపూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న యువకులు

## షబ్బీర్ అలీ జన్మదినం సందర్భంగా రక్తదానం

కామారెడ్డిటౌన్, ఫిబ్రవరి 15: రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా పట్టణంలోని క్లాసిక్ గోల్డెన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరంలో నాయకులు, యువకులు 336 యూనిట్ల రక్తదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో అన్నదానం, గ్రంథాలయంలో యువకులకు భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు ఇలియాస్, నయిం, కైలాస్ శ్రీనివాస్‌లు మాట్లాడుతూ.. మహనేత షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా 336 యూనిట్ల రక్తం దానం చేయడం గొప్పవిషయమని అన్నారు. ఆ రక్తాన్ని తలసేమియాతో బాధపడుతున్న వారికి అందించేందుకు ముందుకు రావడం అభినందనీయమని అన్నారు.

**బాన్సువాడలో..**

బాన్సువాడటౌన్: బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వ్యవహారాల ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను గురువారం కాంగ్రెస్ నాయకుడు కాసుల బాల్‌రాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం స్థానిక మాతాశిశు సంరక్షణ ఆస్పత్రిలో రోగులకు ఉచితంగా బ్రెడ్, పండ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మైనార్టీ నాయకుడు ఖాలేక్ మాట్లాడుతూ.. మైనార్టీలకు 4 శాతం రిజర్వేషన్ కల్పించిన ఘనత షబ్బీర్‌అలీదేనన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ రోహిత్, ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ ప్రసాద్, షేక్ అజీం, శాహబ్, వెంకన్న, బిట్ల సూరి, తదితరులున్నారు.

**బీర్కూర్‌లో..**

బీర్కూర్: మండల కేంద్రంలో ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి కొత్త కాపు కాంత్‌రెడ్డి, నాయకులు శంకర్, బస్వరాజ్, కమలాకర్‌రెడ్డి, ఎక్బాల్, సాయిలు, నరసింహారావు, పాల్గొన్నారు.

**భిక్కనూరులో..**

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో మాజీమంత్రి షబ్బీర్‌అలీ జన్మదిన వేడుకలను కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సినిమాటాకీసు చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు కేక్ కట్‌చేసి పెద్దఎత్తున టపాసులు కాల్చారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ.. షబ్బీర్‌అలీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు భీంరెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి ఇంద్రకరణ్ రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, ఎంపీపీ గాల్‌రెడ్డి, ఎన్ఆర్ఐ సెల్ జిల్లా కన్వీనర్ సుధాకర్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

**రామారెడ్డిలో..**

రామారెడ్డి: మండలంలోని ఆయా గ్రామాలల ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్‌అలీ జన్మదినం సందర్భంగా నాయకులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు, పెన్నులు, పుస్తకాలను అందించారు. రోగులకు ఉచితంగా పండ్లు, పాలు అందించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ మోహన్‌రెడ్డి, బండిప్రవీన్, లింగం, బాలరాజు, నర్సిరెడ్డి, సాయిలు, ప్రవీణ్‌గౌడ్, దయానంద్, ఇర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన పలువురు నాయకులు

మాచారెడ్డి, ఫిబ్రవరి 15: మాచారెడ్డి మండలంలోని పలువురు నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఇలియాస్, నయింలు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ షేక్ అజీజ్ తదితరులు ఉన్నారు.

## కామారెడ్డికి 'రేరా' ఛైర్మన్

కామారెడ్డి టౌన్, ఫిబ్రవరి 15: కామారెడ్డి పట్టణానికి 'రేరా' ఛైర్మన్ సత్యనారాయణ గురువారం వచ్చారు. తన చిన్ననాటి స్నేహితుడు బాంబేక్లాత్ హౌస్ ఎదుట నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అన్నదానం చేశారు. అలాగే ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్న వీటీ లాల్‌ను అభినందించారు. గతంలో కామారెడ్డి జిల్లాలో మొట్టమొదటి కలెక్టర్‌గా పనిచేసిన ఆయన పలువురితో ముచ్చటించారు.

## విద్యుత్‌షాక్‌తో రైతు మృతి


కుంటపెద్దబాల్‌రెడ్డి (ఫైల్)

సదాశివనగర్, ఫిబ్రవరి 15: మండలంలోని కల్వరాల్ గ్రామానికి చెందిన కుంట పెద్ద బాల్‌రెడ్డి (56)అనే రైతు విద్యుత్‌షాక్‌తో గురువారం మృతి చెందినట్లు ఎస్సై రాజు తెలిపారు. వ్యవసాయ పనుల నిమిత్తం పంట చేనులోకి వెళ్లి తన బోరువద్ద ప్రమాదశాత్తు విద్యుత్ వైర్లు తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. భార్య కుంట శ్యామల అందించిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు.

## సినిమా గైడ్ కామారెడ్డి



| కామారెడ్డి | |
|---|---|
| దర్శన్ | హనుమాన్ |
| శాంతి | ఊరు పేరు భైరవకొన |
| ప్రియా 70 | ఈగల్ |
| ప్రియా 35 | రాజధాని ఫైల్స్ |

| బాన్సువాడ | |
|---|---|
| మహేశ్వరి | ఈగల్ |
| వెంకటేశ్వర | లాల్ సలామ్ |

## చికెన్ ధరలు



| రకం | లైవ్ | విత్‌స్కిన్ | స్కిన్‌లెస్ |
|---|---|---|---|
| సుగుణ (కిలో) | 100 | 160 | 180 |
| పెన్‌కాబ్(కిలో) | 100 | 180 | 210 |

